# స్పృహ

ఏదైనా రైలు ప్రమాదమో, రోడ్డు ప్రమాదమో జరిగినప్పుడు చెల్లాచెదురుగా పడిపోయిన మృతదేహాల ఫొటోలనూ, తీవ్రంగా గాయపడి 'స్పృహ' కోల్పోయిన వాళ్ళ పొటోలనూ అప్పుడప్పుడూ మనం పత్రికల్లో చూస్తూ ఉంటాం!

సమాచార రంగంలో విప్లవాత్మకమైన మార్పులు చోటు చేసుకుంటోన్న నేపథ్యంలో - ఏదైనా ఒక ప్రమాదం జరిగినపుడు - ఆ 'న్యూస్' ని సాటి పత్రికలకన్నా ముందుగా 'ఫ్లాష్' చేద్దామన్న 'తొందర'లో... ఆ బీభత్సాన్ని 'సహజం'గా, కళ్ళకి కట్టినట్టుగా అందిద్దామన్న 'తపన'తో ఫొటోగ్రాఫర్లు ఉన్నదున్నట్లుగా ఫొటోలు తీయడం... వాటిని ఎడిట్ చేయకుండా పత్రికాధిపతులు యథాతథంగా ప్రచురించడం పాఠకుల దురదృష్టం!

తమ బంధుమిత్రుల దుర్మరణమే ఓ వైపు కృంగదీస్తూంటే - మోకాళ్ళదాకా తొలిగిపోయిన బట్టలతో - ఎలాంటి ఆచ్ఛాదనా లేని గుండెలతో.... ఆడవాళ్ళ ఫొటోలు పత్రికల్లో... టీ.వీ.ల్లో లక్షలాది పాఠకులకి దర్శనమిచ్చినపుడు.... రక్త సంబధీకుల మనసు క్షోభిస్తుందన్న 'స్పృహ' - ఎవరికీ లేకపోవడం విచారించదగ్గ విషయం !

ఇహ - అస్తమానం ఏదో ఒకటి వాగే వాగుడుకాయలు - చాలాసార్లు తామేం మాట్లాడుతున్నారో తమకే తెలీకుండా మాట్లాడ్డం గమనిస్తూ ఉంటాం ! తాగిన మైకంలో 'స్పృహ' లేకుండా ఏదేదో వాగడం వేరూ, 'స్పృహ'లోనే ఉండీ, స్పృహలేనట్టు ఏమిటేమిటో వాగడం వేరు.

అది ఏ వాగుడైనా... శృతి మించినపుడు..

ఏయ్! ఒంటిమీద స్పృహ ఉండే మాట్లాడుతున్నావా ?' అని ఎదుటివాళ్ళు అలాంటి వాగుళ్ళకి కళ్ళెం వేయడానికి ప్రయత్నించడం చూస్తూ ఉంటాం !

అన్నింటికన్నా విచిత్రమైన విషయం కొంతమంది మనుషుల్లో 'పరిసరాల స్పృహ' ఇసుమంతైనా లేకపోవడం!

ఇలాంటి వాళ్ళు ఎక్కడో ఏ బాత్రూం లోనో ఎవరికంటా పడకుండా చేసుకోవలసిన పనులను అక్కడికి అవేవో అందరి ముందూ చేసుకోగలిగే అతి సహజమైన పనుల్లా....

ముక్కులో వేలు పెట్టి గిరగిరా తిప్పడం...

శరీరంమీద ఎక్కడబడితే అక్కడ బరబరా గోక్కోవడం...

తింటోన్న వాళ్ళదగ్గర 'బర్'మని చీదడం...

ఎక్కడంటే అక్కడ 'యాక్‌థూ' అని ఉమ్మేయడం -



*Contd...*

ఇంటి వాకిట్లో కూర్చుని తన్మయత్వంగా పేలు చూసుకోవడం....

కొన్ని వేల మంది ప్రయాణీకుల కంట పడ్తామన్న స్పృహైనా లేకుండా - వచ్చే పోయే రైళ్ళకి ఇరుపక్కలా... తీరుబడిగా కాలకృత్యాలు తీర్చుకోవడం -

చూసేవాళ్ల కడుపులో దేవినట్లు చేస్తాయి!

'పరిసరాల స్పృహ' మనిషిని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంచి - అందరి మన్ననలకీ పాత్రం చేస్తే -

'స్పృహలేని తనం' సభ్య సమాజానికి ఒళ్ళు జలదరించేలా చేస్తుంది!

అజ్ఞానం, అవిద్యల మూలంగా అమాయకపు పల్లెజనులు, 'నిరక్షరాస్యులు' అనాగరికంగా ప్రవర్తించినపుడు - సరిపెట్టుకోవచ్చునేమో గానీ.....

కార్లలో తిరుగుతూ, సూటూ, బూటూ వేసుకొని - ఆడవాళ్ళున్నారన్న స్పృహ కూడా లేకుండా - 'కుళ్ళు' జోకులతో జుగుప్స కలిగించేలా బూతులు మాట్లాడే 'విద్యావంతుల'ను జాతి క్షమించలేదు !

16-05-1996